టికెట్టు అడిగి చూసుకుంటూ వెళుతున్నారు. ఇదంతా గమనిస్తున్న మన కథా నాయకుడు ఇన్‌స్పెక్టరుకు ఏం సమాధానం చెప్పాలో మననము చేసుకుంటూ యున్నాడు. ఇన్‌స్పెక్టరు (టి.టి.ఐ.) యువకునివద్దకు రాగానే తను అనుకున్నట్లుగానే, కండక్టరు నన్ను టికెట్టు తీసుకొమ్మని అడగలేదు, నేను తీసుకోలేదు సార్, అతనికొరకుకూడ చూశాను కాని ఈ జనంలో అతను కన్పించలేదు అని చెప్పాడు.

చెకింగు పూర్తయి రిపోర్టు వ్రాస్తుండగా కండక్టరు ఎంతగానో చెప్పాడు. తను అతనికి టికెట్టు ఇవ్వంది దురుద్దేశముతో కాదని కాని ఆ ఆఫీసర్ కండక్టరు మాట విన్పించుకోకుండా ఏదో వ్రాసివెళ్ళాడు.

★ ★ ★

వారం రోజుల తర్వాత ఓ ఇంటర్వ్యూకు వెళ్ళిన ఈ యువకునికి, ఆ ఆఫీసులోగ ఇంటర్వ్యూకివచ్చిన ఓఅభ్యర్థి తనకా ఉద్యోగము ఎలాగైనాసరె ఇవ్వమని ప్రాధేయపడుతున్న మాటలు వినవచ్చాయి. ఆ అభ్యర్థి, సార్ నాకీ ఉద్యోగం ఇప్పించండి సార్, ముసలి తల్లి, రోగిష్ట భార్య, పెళ్ళి చేయాల్సిన చెల్లెలు వీరంత నా ఉద్యోగంమీద ఆధరపడి వున్నారు నాకీ ఉద్యోగం ఇవ్వకపోతే అందరము పస్తులుండి చావల్సివస్తుంది సార్ అంటూ ఎంతో వేడుకుంటూన్నాడు. ఆ అధికారి, అధికారయుతంగానే సరేకాని బయటికి వెళ్ళు అంటున్నాడు. చెమటలు తుడుచుకుంటూ బయటకు వచ్చిన ఆ వ్యక్తిని చూచిన ఈ యువకుడు క్షణంసేపు నిర్ఘాంతపోయాడు. అతను ఆరోజు బస్సులో పట్టుబడిన కండక్టరు. ఔను. తనమూలంగానే పట్టుబడిన కండక్టరు, అతనికి లీలగా జరిగింది అర్థమైంది. నా నలబై పయిసలకొరకు, ఎదుటి నల్గురు జీవితాలకు ఎన్ని కష్టాలు తెచ్చాను అని బాధపడుతూ, ప్రశ్చాత్తాపపడుతూ, ఆ ఇంటర్వ్యూకు వెళ్ళకుండా, ఆతన్ని క్షమించమని అడుగుటకు మాజి కండక్టరు వెనక నడవసాగాడు.

# : సంఘర్షణ :

* రచన : శ్రీ తుమ్మల దాదారెడ్డి *

"ఎటురా ఆనంద్ ?" "కాలేజికి"

ఈమధ్య రెగులర్గా అటెండ్ ఔతున్నావ్ !' "అంటే ఇంతకుముందు ఎగవేశానా ?" "కాదనుకో, అన్నట్టు మరచాను పెళ్ళిచూపులకు వెళ్ళావటగా !" "నీకెవరు చెప్పార్రా! మొత్తంపై నీవసాధ్యుడివిరా"

"పిల్ల నచ్చిందా! ఏమి చదువుతుంది ?" "ఏ నిర్ణయానికీ రాలేకపోతున్నాను. ఇంటర్ చదివింది"

లిప్తకాలం నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలోనే మనసులో గతం నృత్యం చేసింది.

★ ★ ★

"ఒరేయ్ ఆనంద్ ! నీకు పిల్లనిస్తామని వచ్చారురా !"

"నా పెళ్ళికి తొందరేమొచ్చింది ?"

"తొందరేం కావాలిరా ? నీ ఈడొచ్చేసరికి నీవు నాకు పుట్టావు" "మీకాలం సంగతి వేరు ! నేనిపుడు చేసుకోను."

"నీకేమి పిచ్చిపట్టిందా! అమ్మాయి చదువుకుంది. ముప్పయి వేలు ఇస్తారట. అమ్మాయి తండ్రి ఓడిపోయిన శాసన సభ్యుడు. ఉద్యోగంకూడా యిప్పిస్తారట. అన్నివిధాలా అనువైన సంబంధం కాదనకురా !"

"ఏమో !" అని తప్పించుకున్నాను.

"ఏరా ! బాగా ఆలోచిస్తున్నావ్" అన్న రవి మాటలో నేను ఈ లోకంలోకి వచ్చాను.

ఏంలేదురా రవీ ! మనసేం బాగుండటం లేదు.

నేనిక కాలేజికి వెళ్తాను. సాయంత్రం తప్పకుండా ఇంటికిరా అని అంటూనే నేను కాలేజికి నడిచాను.

కళాశాల ఆవరణ! విద్యార్థినీ విద్యార్థులతో నిండి ఆహ్లాదకరంగా ఉంది. గుంపులు గుంపులుగా చేతులు కలిసి పకపకమని నవ్వుతూ కళాశాలలోనికి వెళ్తున్నారు. గంటమ్రోగడం మూలాన ఎవరి తరగతుల్లోకి వారు నడుస్తున్నారు.

'ఆనంద్' అనే పిలుపు వినగానే ఆత్రంగా వెను తిరిగి చూశాను. "ఓహో! నీవా" అంటూ ఆగాను. వెదకబోయిన తీగే కాళ్ళకు తగిలినట్లయ్యింది.

"రెండు రోజులనుండీ నీవు కానరాక దిగులుగా వుంది. ఇవ్వాళ తమ్ముడ్ని మీ యింటికి పంపిద్దామనుకుంటున్నాను"

"నీ మాటలకేంగాని నేను విషమ పరిస్థితుల్లో ఇరుక్కున్నా"

"అవేమిటో చెప్పు, నేను తేల్చిపారేస్తా"

"లతా! నేను ఇప్పుడేమీ చెప్పలేను పీరియడ్స్ కాగానే మీ ఇంటికి వస్తా"

"మంచిది అలాగే. నేను నిరీక్షిస్తుంటా తప్పకుండా రా"

ఆ మాటను పూర్తిగా విన్నాక క్లాసురూంలోకి వెళ్ళాలనిపించలేదు బైటచేసేపని ఏమీలేదు. అందుకే ఏమీతోచక క్లాసులోకి వెళ్ళాను. ఆలోచనలు పరిపరి విధాలా సాగింది. మనసేమో పెళ్ళిచూపుల ఘట్టాన్ని నెమరువేస్తోంది.

★ ★ ★

"అమ్మాయిని రమ్మనండి" నిశ్శబ్దాన్ని చీల్చింది పెద్దమనిషి మాట. నాలో ఆతృత ఎక్కువయ్యింది. పరిసరాలవైపుకు చూస్తూ యోచిస్తున్నా. దర్వాజకు వున్న పరదా ఒక ప్రక్కకు వెళ్ళింది. నేలచూపులు చూస్తున్న అమ్మాయి ముందునిల్చింది. అమ్మాయి ఎటో చూస్తుంది నేనుమాత్రం ఆమెనే చూసాను. పెద్ద అందమనేది ఏమీలేదు, వికారంగామాత్రం లేదని అంతరాంతరాల్లో తీర్మానించుకున్నా! ఆ సమయంలో యోచనలు రకరకాలు. అమ్మాయి లోనికి వెళ్ళింది. మా సమాధానం ఉత్తరంద్వారా తెలుపుతామని చెప్పి ఆ రంగస్థలంనుండి నిష్క్రమించాం.

"ఆనంద్! ఏమిటా ఆ ఆలోచన? చెప్పే ప్రాబ్లం నీకవసరం లేదా" అన్న లెక్చరర్ మాట ఆలోచనలకు అడ్డుపడింది. దృష్టి ప్రాబ్లంవైపు మరలింది. ముళ్ళపై కూర్చున్నట్లుంది. పీరియడ్ అయ్యేసరికి తలప్రాణం తోకకువచ్చింది. పెద్దపెద్ద అంగలేస్తూ లత వాళ్ళింటికి నడకసాగించాను. కొత్త ఉత్తేజం పొడసూపింది. ఇల్లు దగ్గరయ్యింది.

"రా ఆనంద్! నీకోసమే చూస్తున్నా. మాకివ్వాళ అన్ని పీరియడ్స్ జరుగలేదు. అందుకే అప్పుడే వచ్చాను"

"నాక్కూడా పీరియడ్స్ లేవు" చిన్న అబద్ధమాడాను. "కూర్చో, ఏమిటి విశేషాలు?"

"లతా! నేను పెళ్ళి చూపులకు వెళ్ళాను"

"ఓహో! చాలా ముందడుగువేశావు"

"నీకేదీకాని వేళాకోళంగానే వుంటుంది. నాకంతా గందరగోళంగా వుంది"

"అదిసరేకాని అమ్మాయి ఏం చదివింది?" "ఇంటర్ చదివి మానుకుందట."

"నీకు అమ్మాయి నచ్చిందా?" "నేనా అమ్మాయిని చేసుకునే ఉద్దేశ్యంతో చూడలేదు. మాతండ్రి బాధ భరించలేక చూశా. ఆ అమ్మాయి బాగాలేదని అనలేను. ఆ ముద్రను ఆమెపైవేసి కించపరచడం ఇష్టంలేదు. పెళ్ళిచేసుకోవడం అంతకన్నా ఇష్టంలేదు. ముందునుయ్యి వెనుకగొయ్యి ఎటు వెళ్ళాలో తెలియని స్థితి మనసులో మూగబాధను వ్యక్తం చేయలేకపోతున్నాను"

"నీవీరోజు వేదాంతం వల్లిస్తావ్ నాకేమీ అర్థం కావడం లేదు"

ఔను లతా! నీకు అర్థం కాదు. అర్థమయ్యేలా నేను చెప్పలేను. ఆవేదన చెప్పకుందామంటే మానం పోయేట్టుంది చెప్పకపోతే ప్రాణంపోయేట్టుంది. నేనిక వెళ్తా, తర్వాత కలుస్తానని చెప్పి అచటినుండి కదిలాను.

లతకు నా వైఖరి అంతుపట్టనట్లుంది. యోచిస్తూ కూర్చుంది. ఆలోచనలతో ఆటాడుకుంటూనే ఇల్లు చేరాను. ఇల్లు చేరుకొన్న నేను పుస్తకాలు టేబుల్ పైన పడేసి కుర్చీలో కూలబడ్డా, మెదడు నిండా

చీమల్లా ప్రాకుతున్న ఆలోచనలు. నాలో నేను ఏదో నిశ్చయించుకుని, కలం కాగితం తీసుకుని గది తలుపులు మూసేసి ఉత్తరం వ్రాయడానికి ఉపక్రమించాను.

లతా!

నీవు ఈ ఉత్తరాన్ని పొందడానికి కారణం ఏమన్నది నీకెలా వివరించను. మనము ఇద్దరమూ ఒకే కాలేజిలో చదవడంవలన ఒకే ఆశయాలు కలవారము కాబట్టి కలిసి మెలిసి ఉంటున్నాం. మనము మిత్రులుగానే మిగిలిపోయాం. నీవు నన్నెన్నడూ సోదరునిగానో మరే ఆత్మీయునిగానో భావించలేదు. స్నేహబంధాన్ని త్రెంచనూ లేదు. నీపై నేనెన్నడూ ఏ భావాన్నికూడా కలిగించుకోలేదు. ఇపుడిపుడే పెళ్ళి విషయంగురించి యోచించడంవలననేమో అగుపడిన ఆడదాని నల్లా పరిశీలించడం పరిపాటయ్యింది. నేనెలాంటి దాన్ని ఎన్నుకోవాలోనన్న యోచన అంతరాంతరాల్లో అలుముకొంది. బాగా యోచించాను. కాబోయే భార్యను ఏవిధంగా చూసిననూ నాకు వెలితిగానే గోచరించింది. తగిన ఆడదాన్ని నేను పొందలేనేమోనన్న అనుమానం రేకెత్తింది. నిరాశానిస్పృహలు నీడల్లా వెంటాడసాగాయి. ఆశయాలకు జీవంపోసి ఆశలను నెరవేర్చగల స్త్రీ నా దృష్టిలో ఒక్కతే! ఆ ఒక్కతే ఎవరనుకుంటున్నావు? నీవు ఊహించలేవు. నేనే చెప్తున్నా ఆ స్త్రీవి నీవే! ఆశ్చర్యపడుతావో ఆలోచనలలోపడుతావో నాకేమీ తెలియదు. నేను ఎన్నో విధాల ఆలోచించాను. మనసులో రేగిన సంఘర్షణ నీకెలా వివరించాలో తెలియడంలేదు. మదిలో నీ రూపమే నిండుకుంది. నేనెందుకు యిలా మారిపోయానో నాకే అంతపట్టడం లేదు. నాగురించి నీవు మౌనంగా యోచిస్తావేమోనన్న అనుమానంకూడా ఉద్భవిస్తుంది.

లతా! కళ్ళులేని కామాన్నే ప్రేమ అనుకొనే కళ్ళున్న గుడ్డి సమాజానికి దూరంగావుంది మనసు. నన్ను నిలువుగా ఆనందపుటంచుల్లో నిలిపివేసి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఎందుకో కాని నీవంటే చాలా యిష్టం.

మొన్న నేను చూసివచ్చిన అమ్మాయి బాగానే వుంది అయితే నేనా అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలనుకోవడం లేదు, అనుకోనుకూడా. ఎందుకు అన్న సందేహ మొచ్చిందా! ఆ అమ్మాయి రూపాన్ని నానుండి దూరం చేసింది నీలోని ఏదో శక్తి. నీముందు నా దృష్టిలో ఇతరులంతా దిగదుడుపే! నీవు అందగత్తెవు కావని అందరనగా వింటిని. అందంతో అవసరంలేదు అది నీటిబుడగలాంటిదని తెలుసు. లతా! నేను నిన్నుతప్ప ఎవరినీ పెళ్ళిచేసుకోను అందుకు యోగ్యున్ని కాను కాలేను. నీవు నన్ను పిచ్చివాడనుకుంటావో ఏమో! ఏమైతే అను మన ఇద్దరిమధ్య అడ్డు ఏమీలేదు అని ఆనేందుకు మనసు ఒప్పుకోదు. ఎందుకంటావా! మన యిద్దర్నీ చూసినపుడు మీ అమ్మ అనె మాట గుర్తొచ్చేసరికి గుండె గుబేల్ మంటుంది. ఆ ఒక్క మాటే సంఘర్షణ లేపింది. ఆమాట నీకు గుర్తు ఉందో లేదో నేనైతే మరువలేదు. "ఆనంద్, నీవూ లతా తోబుట్టువుల్లాగుంటారు" మీ అమ్మ ఇలా అన్నప్పుడు నేను నిన్ను తోబుట్టువుగా మాత్రం ఊహించుకోలేదు. ఒకవేళ నీవు నన్ను అలాగే ఊహించుకుంటావేమోనన్న అనుమానమే యోచనలకు మార్గాన్నివ్వక నన్ను తికమకలో ముంచేస్తుంది. నీ మనసు నేనెరుగను. ఇదంతా చదివాక నీ దృష్టికి నేనెలా అగుపడుతానో? ఈ ఉత్తరానికి జవాబు ఇవ్వమనె ధైర్యంలేదు. నన్ను అర్ధంచేసుకుంటేచాలు. నాగురించి నీవు సానుభూతే చూపిస్తావో చిన్నచూపే చూస్తావో లేక ప్రేమిస్తావో నీవేమిచేసినా చేయగలవు నేను మాత్రం ఏమీచేయలేను. ఒక్కటి మాత్రం గుర్తుంచుకో ఆనంద్ అంటే వ్యక్తిత్వమున్న మనిషి. చెప్పాల్సిందంతా చెప్పేశాను ఏంచేస్తావో నీ యిష్టం.

నీ

—ఆనంద్.

ఉత్తరాన్ని ఓమారు చదువుకుని జేబులో పెట్టుకున్నాను. రేపు కాలేజీలో కల్సినపుడు యిద్దామని నిశ్చయించాను.

"ఈమధ్య నీకేమైనా పిచ్చిపట్టిందా ఎప్పుడూ ఏదో ఆలోచిస్తావు" అంటూ అమ్మ గదిలో అడుగు పెట్టింది.

"పిచ్చిపట్టలేదుగాని పట్టేట్టుంది" అంటూ మిత్రుడు కూడా చేరాడు.

"ఏం రవీ! కులాసా? అగుపడటమే లేదు"

“ వలాసే అమ్మా! అరేయ్! లేచి మొఖం కడుగ్గురారా”

“ నీకెప్పుడూ తొందరే ఆగరాదురా” అని నేను [illegible]ని కెళ్ళి కాలుచేతులు కడుక్కొని రెండు కప్పుల టీతో రవిముందు నిలిచాను.

రవీ! ఈ టీ త్రాగరా, బజారుకు భయలుదేతాము.

ఆనంద్ ఇంతకు నీ సంగతేమిట్రా? ఏ సంగతిరా? అదే పెళ్ళి సంగతి.

ఆ విషయం నన్నడగకు ఏమీ చెప్పలేను. అలా అంటావేమిరా?

“ ఔను రవీ! నా బాధ నీ కర్థంకాదు, నేను చెప్పలేనుకూడా, నాలుకమధ్య ముల్లుంది, ఎటు కదిలినా అది గుచ్చుతుంది”

వేదాంతం వల్లించక ఏడ్చేదేదో చక్కగా ఏడ్వరాదు, “ ఔను రవీ నాకు మిగిలింది ఆ ఏడుపే”

“ నీవింత బాధపడటమెందుకు? ఆ అమ్మాయి నచ్చితే నచ్చిందని లేనిచో నచ్చలేదని చెప్పొచ్చు గదా! లేకుంటే ఎవరినో ప్రేమించినట్లైతే ఆ విషయం చెప్పు?”

నీవు అన్నమాటల్లో ఏ ఒక్కటీ చెప్పలేని బలహీనునిగా మారిపోయాను రవీ! నేను రేపో పనిచేయబోతాను, సఫలీకృతున్నవుతానో కానో తెలియదు.

“ అదేంటో చెప్పరా సమాధానం నేను చెపుతా”

ఆ ధైర్యం నాకు లేదురా. ఇద్దరమూ విడిపోయాము.

★ ★ ★

“ అరే ఆనంద్! ఏ నిర్ణయాని కొచ్చువురా?”

“ ఏ నిర్ణయానికీ రాలేకపోయాను, ఆలోచించుకో నివ్వండి”

ఏ విషయమో తొందరగా తెలుపమని వారు నన్నొత్తిడి చేస్తున్నారు, నీవేమో ఇలా మాట్లాడుతావు, నాకేమీ అంతుపట్టడం లేదురా.

“ నా నిర్ణయం రేపు తెలుపుతా” అంటూనె అచ్చటినుండి లేచాను, దినమంతా ఆలోచనలతో వేడెక్కిన బుర్రకు అలసిపోయిన శరీరానికి విశ్రాంతి సమయం ఆసన్నమయింది, అమావాస్య చీకటి అలుముకుంటుంది, అన్నం తిని పడక గదిచేరాను, కిటికీలోంచి బయటకు చూస్తే అంతా చీకటే, మనసులాగే వుంది, నిద్రాదేవి నన్ను కనికరించడంలేదు, దాన్ని జయించే ఆయుదాన్ని తీసాను, అదేమిటో కాదు పుస్తకం పది పేజీలు మరలవేసినట్లు గుర్తుంది.

TRADE MARK
PANJU TEX
సాటిలేని
పంజుటెక్స్
Pటెక్స్ హీరో
హాంక్‌కాంగ్ ఫైన్
మరియు అనేక రకముల తయారింపులు
తయారించువారు:
ది పంజు టెక్స్‌టైల్స్
తిరుపూరు-638602.

చేతిలో నోట్ బుక్, జేబులో నిన్నటి ఉత్తరం ఉందా లేదా అని చూసాను, భద్రంగానె ఉంది, ఓమారు చదివాను, ఏదో గొప్పతనం నడకలో ఏదో సాధించబోతున్నట్లు అణువణువున గర్వం దొణికిసలాడుతూంది, తృప్తిగా నడుస్తున్నా.

“ అరేయ్ ఆనంద్! నీకో విజాద వార్త చెప్పాలి” అంటూ సైకిల్ ప్రక్కన ఆపి నిల్చున్నాడు రవి.

నాలో ఆతృత అధికమైంది, తొందరగా చెప్పు.

“ లత చచ్చిపోయిందిరా”

“ ఎ...లా” లోతునుండి వచ్చిన మాటకు రవి ఆశ్చర్యపోయాడు.

“ అరే! ఒక్కసారే యిలా మారిపోయావు చెమట తుడ్చుకో! పాపం పాము కట్టి చచ్చిపోయిందట చూద్దాం పద.”

ఇంటినిండా జనం, నిద్రలోనున్నట్టే వుంది లత, ఆ శవంలో అగుపడేవి నిండుదనం, హుందాతనం, అందరితోపాటు కనులుకూడా నీరు కార్చాయి, జేబురుమాలును కనులకు హత్తుకుని ఇల్లుచేరుకునేసరికి అవతారమే మారింది.

“ కాలేజీకి పోలేదేంరా” అన్న తండ్రి మాటకు “ పోలేదు” అనె సమాధానం.

నన్ను జేబులోని ఉత్తరం వెక్కిరించింది, ఉత్తరాన్ని నామరూపాలు లేకుండా చింపివేశాను.

“ ఏంరా వాళ్ళకు సమాధానం ఏమి వ్రాయమంటావు? ప్రశ్న మళ్ళీ దండెత్తివచ్చింది.

“ ఒప్పుకున్నట్లు వ్రాయండి” గుండెల్ని చీల్చుకుని వచ్చిందీమాట.